


# ప్రేమలేఖ



సుసర్ల సర్వేశ్వర శాస్త్రి

వెంకటేశం ఓ దుర్ముహూరాన (పాఠకులకు) కలం పట్టి రచనలు చేయాలని సంకల్పించాడు. తన పేరు పత్రికలలో చూసుకోవడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకోడంతో ముందు ఉత్తరాల రచయితగా స్థిరపడాలని అనుకున్నాడు.

కొత్త పత్రిక మార్కెట్లో విడుదల కాగానే అద్దె షాపులోంచి తెచ్చుకుని వెంటనే అభిప్రాయం రాసేసున్నాడు. అయితే అతను ఇరవై వాక్యాలు రాస్తే పత్రికలో రెండు వాక్యాలే వేస్తుండడంతో కొత్త టెక్నిక్ కనిపెట్టాడు. పత్రిక రాగానే రచన పేరు, రచయిత పేరు, తేదీ వెంటనే కార్డుపై రాసేసి రచన చదవకుండానే పొగడాలనుకున్నప్పుడు 'హైలైట్', 'కనువిప్పు కలిగించేది', 'ఈ మధ్య కాలంలో ఇంత మంచి రచన చదవలేదు' లాంటి డైలాగులు, విమర్శించాలనుకున్నప్పుడు 'రచనలో వైవిధ్యం లేద'ని, 'శైలి బాగులేద'ని, 'ఇంకా మంచి రచనలు రావాలి' అని రాసుంటాడు. సీరియల్స్ గురించి రాయాలనుకున్నప్పుడు "వచ్చే సంచిక కోసం ఎదురు చూస్తున్న నాకు నిద్రపటడంలేదు", "సినిమా చూస్తున్న అనుభూతితోబాటుగా నా అభిమానతారలు కళ్ళముందు నటిస్తున్నట్లుగా అనిపిస్తోంది ఈ రచన చదువుతోంటే", "ఈ సీరియల్ కోసం నేను పది మైళ్ళు నడిచివెళ్ళి పుస్తకం కొంటున్నాను" అని రాస్తున్నాడు. అతని లేఖలు ప్రచురించబడని పత్రిక దాదాపు లేదని చెప్పుకోవచ్చు. పాఠకులకు అతని పేరు కంఠతా అయిపోయింది.

అయితే వెంకటేశం అంతటితో సంతృప్తి చెందక మినీ కథలు రాయడం ప్రారంభించాడు. స్వంతంగా రాసిన రచనలు ఒకదాని వెనుక మరొకటి 'క్యూ' కట్టుకుని శరవేగంతో తిరిగి రావడంతో ఎప్పుడో చదివిన కథలు బాగా మార్పుచేసి పంపగా డజనుకు పైగా తిరిగి వచ్చినా రెండు అచ్చయినాయి

ఇదే సమయంలో అదే వీథిలో వుంటున్న సరోజను ప్రేమించడం మొదలెట్టాడు వెంకటేశం. సరోజ చాలా చలాకీగా వుంటుంది. అంతే కాదు ప్రతీ పుస్తకం, నవలా క్రమం తప్పక చదువుతుంటుంది. నిజం చెప్పాలంటే ఆమె దృష్టిని ఆకర్షించడానికే ఉత్తరాల రచయితగా మారాడని చెప్పుకోవచ్చు. సరోజ వెంకటేశంతో చనువుగా మాట్లాడుతుంటుంది. వాళ్ళింట్లో ఎవరికి వచ్చిన ఉత్తరాలు వాళ్ళే చదువుతారని తెలిసి తన రచనా శక్తి అంతా వినియోగించి ఆమె తనను ప్రేమించే రీతిలో ఒక చక్కని ప్రేమలేఖ రాసి ఆమెకు పోస్ట్ చేసి సమాధానం కోసం ఎదురు చూడసాగాడు.

రెండు రోజుల తర్వాత పోస్ట్‌మేన్ వెకిలిగా నవ్వుతూ ఎర్రటి కవరు అందించాడు. తిరిగొచ్చిన కథలు ఇచ్చేటప్పుడు అలా నవ్వే అతన్ని చిరాగ్గా చూసి ఏ పత్రికనుంచి తిరిగి వచ్చిందో అని ఆలోచిస్తూ కవరు చించి అందులో కాగితాలు బయటకు లాగాడు. ఆశ్చర్యం! అవి తాను రచనకు ఉపయోగించే కాగితాలు కావు. కాని కవరు మీద తాను స్వయంగా రాసిన చిరునామా వుంది. కాగితం విప్పి చదవడం మొదలెట్టాడు.

మిత్రులు వెంకటేశం గారికి!

నమస్తే! మీరు రాసిన ప్రేమలేఖ అందింది. దాంతోపాటు మీరు జతచేసిన "ఈ ప్రేమలేఖ దేనికీ అనువాదం, అనుసరణ, కాపీ కాదని, నా స్వంత మేనని, ఆమోదయోగ్యం కానియెడల తిప్పిపంపుటకు వీలుగా తగిన పోస్టేజితో, స్వంత చిరునామా కలిగిన కవరు జత చేస్తున్నాను ...." అనే హామీ పత్రం, కవరు కూడా అందాయి. మీ లేఖ క్షుణ్ణంగా పరిశీలించాను. కాని ఈ ప్రేమలేఖ ఆరుసంవత్సరాల క్రిందట విడుదలైన "ప్రేమతరంగాలు" అనే నవలలో హీరోయిన్‌కు హీరో రాసిన లేఖకు యధాతథంగా అనుసరణ అని తెలియచేస్తూ, ఆమోదయోగ్యం కాదని తెలియచేయడానికి విచారిస్తున్నాను.

— సరోజ.

ఆ ఉత్తరాన్ని చదివి నీరసంగా కుర్చీలో కూలబడిపోయాడు రచయిత(?) వెంకటేశం.

